నేడు ఉగాది

సీఎం స్టాలిన్ సహా నేతల శుభాకాంక్షలు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తెలుగువారందరూ తమ తొలి పర్వదినమైన ఉగాదిని ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్న వేళ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలియ జేశారు. స్టాలిన్ వెలువరించిన ఓ సందేశంలో... రాష్ట్రంలో, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉగాది పండుగను జరుపుకోనున్న ద్రావిడ సంతతికి చెందిన తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. అదే సమయంలో కర్ణాటక రాష్ట్రంలోనూ ఉగాదిని జరుపుకునే కన్నడిగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో భాషాపరమైన మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. రాష్ట్రంలో తెలుగు ఉగాదికి ప్రభుత్వ సెలవు ప్రకటించిన ఘనత డీఎంకే ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. కొత్త దుస్తులు ధరించి, మామిడి తోరణాలు, పూల అలంకరణలు, ఉగాది పచ్చడితో ఉగాదిని స్వాగతించేందుకు సిద్ధమైన తెలుగు ప్రజలందరికీ తన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆ సందేశంలో వివరించారు.

ఎడప్పాడి శుభాకాంక్షలు...

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి కూడా తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉగాది పండుగను జరుపుకోనున్న తెలుగు వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లుపేర్కొన్నారు. ఇదే విధంగా ఉగాదిని జరుపుకోనున్న కన్నడ సోదరులకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.

సెల్వపెరుంతగై...

టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై వెలువరించిన ఓ సందేశంలో రాష్ట్రంలో నివసిస్తున్న తెలుగు, కన్నడ సోదరులందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. భాషాపరంగా వేరైనా తెలుగు, కన్నడ ప్రజలందరూ తమిళులతో కలిసిమెలిసి సమైక్యతకు ప్రతీకగా ఉంటున్నారని అభినందించారు. ఉగాది పర్వదినం సందర్భంగా జాతి, మత, కుల విద్వేషాలు అంతమై ప్రజలమధ్య సమైక్యత ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ తరఫున తెలుగు వారందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాని పేర్కొన్నారు.



శ్రీకన్యకాపరమేశ్వరి మహిళా కళాశాలలో ఉగాది వేడుకలు

సుఖశాంతులతో... దినకరన్

అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ విడుదల చేసిన ఓ ప్రకటనలో... ఉగాది తెలుగువారందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని పేర్కొన్నారు. కొత్త సంవత్సరం తెలుగు ప్రజలందరికీ సుఖశాంతులు కలిగించాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

ఇదే విధంగా ఐజేకే అధ్యక్షుడు డాక్టర్ పారివేందర్, రవి పచ్చముత్తు, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ కూడా తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

పాండీబజార్‌లో నేడు మోదీ రోడ్‌షో

● ఐదంచెల భద్రత ● ముమ్మరంగా వాహన తనిఖీలు ● నిఘా విధుల్లో 22 వేలమంది పోలీసులు



పాండీబజార్‌లో మోదీ రోడ్‌షో కోసం ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం సాయంత్రం నగరంలోని ప్రముఖ వాణిజ్య ప్రాంతం టి.నగర్ పాండీ బజార్‌లో రోడ్‌షో నిర్వహించనున్నారు. రోడ్‌షో నిర్వహించే రహదారి పొడవునా పోలీసులు ఎత్తయిన భవనాలపై నిలిచి బైనాక్యులర్లతో నిఘా వేస్తున్నారు. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. వివిధ మేన్షన్లు, లాడ్జీల్లో ఆదివారం రాత్రి నుంచే ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. ఇదే విధంగా మఫ్టీ పోలీసులు జాగిలాలలు, మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మొత్తానికి ఐదంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం మహారాష్ట్ర నుంచి ప్రత్యేక విమానంలో మోదీ బయలుదేరి చెన్నైకి చేరుకుంటారు. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కారులో బయలుదేరి నందనం మీదుగా టి.నగర్ పానగల్ పార్కుకు చేరుకుంటారు. పుదియనీది కట్చి అధినేత ఏసీ షణ్ముగం కార్యాలయం ఎదుట ప్రధాని మోదీకి బీజేపీ తరఫున స్వాగత సత్కారాలు నిర్వహిస్తారు. ఆ తర్వాత పానగల్ పార్కు నుంచి పాండీ బజార్ మీదుగా తేనాంపేట సిగ్నల్ దాకా రోడ్‌షో జరుపుతారు. రహదారికి ఇరువైపులా నిలిచే బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు మోదీపై పూల వర్షం కురిపించనున్నారు. ఈ రోడ్‌షోలో బీజేపీ అభ్యర్థులు తమిళిసై సౌందరరాజన్, వినోజ్ పి.సెల్వం, పాల్ కనకరాజ్, పార్టీ సీనియర్ నేతలు, ప్రముఖులు తదితరులు పాల్గొంటారు. రోడ్‌షో నిర్వహించే పాండీ బజార్ ప్రాంతం దుకాణాలు అధికంగా ఉండే ప్రాంతం కనుక పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను మూసివేయాలని పోలీసులు ఉత్తర్వు జారీ చేశారు. అయితే దుకాణాలను మూసివేయాల్సిన అవసరం లేదని బీజేపీ అభ్యర్థి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా దుకాణాలను మూసివేయాల్సిందేనని పోలీసులు పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచే రోడ్‌షో మార్గంపై పోలీసులు నిఘా ముమ్మరం చేస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ తెలిపారు. జాగిలాలతో, మెటల్ డిటెక్టర్లతో బాంబ్ స్క్వాడ్ సభ్యులు రహదారి పొడవునా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. టి.నగర్ ప్రాంతంలో పటిష్ఠ భద్రతా వలయం ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ రోడ్‌షో జరిపే ప్రాంతంలోనూ, రాత్రి బసచేయనున్న గిండీ రాజ్‌భవన్ వద్దా ఐదెంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు సందీప్‌రాయ్ రాథోడ్ వివరించారు.

నిబంధనలు...

ఇదిలా ఉండగా మోదీ రోడ్‌షోకు సంబంధించి డ్రోన్ల సంచారంపై నిషేధం, ప్రకటన బోర్డులు, కటౌట్లు అమర్చకూడదని, వాటర్ బాటిళ్లు కూడా వెంట తీసుకెళ్లకూడదని పోలీసులు పలు నిబంధనలు విధిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం మోదీ టి.నగర్ పానగల్ పార్కు నుంచి పాండీ బజార్ మీదుగా తేనాంపేట వరకు రోడ్‌షో నిర్వహించేటప్పుడు రహదారికి ఇరువైపులా ఇనుప రాడ్లతో బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రోడ్‌షో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటలలోగా ముగించాలి. ప్రధాని రోడ్‌షో మార్గంలో కరపత్రాలు పంచిపెట్టకూడదని, అదే విధంగా స్వాగత తోరణాలు కూడా కట్టకూడదని, రోడ్‌షో మార్గంలో బాణసంచా పేల్చకూడదని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.



పానగల్ పార్కు వద్ద ఏర్పాటైన బారికేడ్లు

రూ.4 కోట్లపై విచారణకు ప్రత్యేక కమిటీ

● రూ.208 కోట్ల విలువైన నగలు, బహుమతుల స్వాధీనం

● ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల కోడ్ ● ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు



పెరంబూర్, ఏప్రిల్ 8: స్థానిక తాంబరం వద్ద నెల్లై ఎక్స్‌ప్రెస్‌లో రూ.4 కోట్ల నగదు పట్టుబడిన వ్యవహారంలో ఆదాయపు పన్ను శాఖ ప్రత్యేక కమిటీ విచారణ జరుపుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు ప్రకటించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల వ్యయ పరిశీలకులు విచారణ నివేదిక అందజేస్తారని తెలిపారు. చెన్నైలో సోమవారం సత్యప్రదసాహు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ఈనెల 19వ తేదీతో ముగిసినా జూన్ 4వ తేది వరకు ఎన్నికల నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసినా కేరళ, కర్ణాటక, పొరుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా, వాటిని పరిగణనలోకి తీసుకొని ఓట్ల లెక్కింపు వరకు కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో నగదు, బహుమతుల బట్వాడా అడ్డుకొనేలా రాష్ట్రవ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారన్నారు. తగిన ఆధారాలు లేకుండా రూ.50,000కు పైగా నగదు, బంగారం, బహుమతులు తీసుకెళ్తుంటే వాటిని స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా చెన్నై నుంచి తిరునెల్వేలికి రైలులో తగిన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.4 కోట్ల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్న వ్యవహారంపై రెవెన్యూ శాఖ ప్రత్యేక కమిటీ విచారణ చేపడుతుందని తెలిపారు.

నగలు, వస్తువులు స్వాధీనం...

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం వరకు రూ.208 కోట్ల విలువైన నగదు, వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అందులో రూ.88.12 కోట్ల నగదు, రూ.4.53 కోట్ల విలువైన మద్యం బాటిళ్లు, ఐఫోన్లు, చీరలు, ధోవతులు, స్టీలు పాత్రలు సహా పలురకాల వస్తువులున్నాయని తెలిపారు. కాగా రాష్ట్రంలో ఇప్పటివరకు 2.08 కోట్ల మందికి బూత్ స్లిప్పులు అందజేశామని సత్యప్రదసాహు తెలిపారు.

స్టాలిన్ ప్రతిపాదించే వ్యక్తే ప్రధాని

● మంత్రి ఉదయనిధి

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తుందని, డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్రముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రతిపాదించే వ్యక్తే ప్రధాని అవుతారని యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి అన్నారు. ధర్మపురంలో సోమవారం మధ్యాహ్నం డీఎంకే అభ్యర్థి మణికి మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ పాలకులకు బానిసలుగా వ్యవహరించిన అన్నాడీఎంకే నేతలంతా ఉన్నట్టుండి ఆ పార్టీతో తెగతెంపులు చేసుకున్నట్లు కపట నాటకాలాడుతున్నారని, ఇప్పటికి వరకూ ఆ నేతలు బీజేపీ నాయకులనుగానీ, ప్రధాని మోదీని గాని విమర్శించలేదన్నారు. తమ కూటమి గెలిస్తే ప్రధాని అభ్యర్థి ఎవరో అన్నాడీఎంకే నాయకులు చెప్పగలరా అని ఆయన ప్రశ్నించారు.



ధర్మపురిలో డీఎంకే అభ్యర్థి మణికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఉదయనిధి

వేలూరు సహా 17 జిల్లాల్లో సెగలు



చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేలూరు, తిరువణ్ణామలై, ధర్మపురి, కృష్ణగిరి, ఈరోడ్ సహా 17 జిల్లాల్లో మరో రెండు రోజులపాటు వడగాడ్పులు వీయనున్నాయి. ఈ యేడాది మార్చిలోనే ఎండలు అధికమవుతూ వచ్చాయి. ఈక్రమంలో ఏప్రిల్ ఆరంభం నుంచే ఉదయం 9 గంటలకే అన్ని జిల్లాల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. అదే సమయంలో సముద్రతీర జిల్లాల్లో సాయంత్రపు వేళల్లో చల్లటి గాలులు వీయక పోవడంతో ఉక్కపోత అధికమై ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వేలూరు, తిరుపత్తూరు, రాణిపేట, కాంచీపురం, తిరువణ్ణామలై, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్, తిరుప్పూరు,కోయంబత్తూరు, ఈరోడ్, కరూరు, తిరుచ్చి, అరియలూరు, పెరంబలూరు, నీలగిరి జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో ఎండలు దంచనున్నాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు హెచ్చరిస్తున్నారు. పగటిపూట ఉష్ణోగ్రత అధికంగా ఉండటంతో సాధ్యమైనంత వరకూ చిన్నారులు, వృద్ధులు ఇంటిపట్టునే గడపటం మంచిదని తెలిపారు. తరచూ మజ్జిగ, కొబ్బరి నీళ్లు, బెల్లం పానకం వంటి పానీయాలు తాగాలని పేర్కొన్నారు. ఆహారంలో కారం, మసాలాలు వినియోగం తగ్గించాలని, ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని తెలిపారు.

పప్పు వేణుగోపాలరావు కన్నుమూత



డాక్టర్ పప్పు వేణుగోపాల రావు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భరతముని నాట్యశాస్త్రాన్ని ఔపోసన పట్టిన అరుదైన వ్యక్తుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన సంగీత, సాహిత్య జ్ఞాని, విద్యావేత్త డాక్టర్ పప్పు వేణుగోపాలరావు(76) కన్నుమూశారు. స్థానిక తిరువాన్మియూరులోని తన చిన్నకుమారుడి నివాసంలో గుండెపోటుకు గురైన ఆయన ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహానికి మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక బీసెంట్ నగర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరగనున్నాయి. తన సతీమణి జయ గత ఏడాది మృతి చెందినప్పటి నుంచి ఆయన తీవ్రంగా కుంగిపోయారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు అమెరికాలో వున్నారు. ఆయన రాగానే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.

సంగీత సరస్వతీ ముద్దుబిడ్డ...

డాక్టర్ పప్పు వేణుగోపాలరావు తెలుగు, సంస్కృతాల్లో పీహెచ్‌డీలు చేసి, గౌరవ డీలిట్‌లను పొందిన సాహితీవేత్త. సంగీత సాహిత్యాలకు పురిటిగడ్డ అయిన విజయనగరం బిడ్డ ఆయన. 'అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్'లో మూడుదశాబ్దాల పాటు పనిచేశారు. 1948 జూన్ 30న ఆయన బొబ్బిలిలో జన్మించారు. మొత్తం ఎనిమిదిమంది సంతానం లో ఆయనే చిన్నవారు. ఆయన విద్యాభ్యాసం విజయనగరం, విశాఖపట్నంలలో జరిగింది. బీఎస్సీ, బీఈడీ, ఎంఏ సంస్కృతం, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లీషు, సంస్కృతం, తెలుగుభాషల్లో పీహెచ్‌డీలు చేశారు. ఇండాలజీలో డీలిట్ ప్రదానం చేశారు. తరువాత తిరుపతి సంస్కృత విద్యాపీఠంవారు హానరరీ డీలిట్ ప్రదానం చేశారు.

ఎలమంచిలి సమీపంలోని దిమిలి గ్రామంలో స్కూల్ టీచర్‌గా పని చేసిన ఆయన.. ఆనక కర్ణాటక స్కూల్లోనూ పని చేశారు. అనంతరం ఎంఏ, తెలుగు, సంస్కృతం పూర్తి చేసి విశాఖపట్నంలోని ఏవీఎన్ కాలేజీలో లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఢిల్లీలో ఉన్న 'అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్'లో తెలుగు నేర్చుకునేందుకు వచ్చేవారికి విశాఖపట్నంలో తెలుగు నేర్పేవారు. ఆయన పని తీరు గుర్తించిన ఇనిస్టిట్యూట్ ఉన్నతాధికారులు.. ఆ సంస్థ మద్రాస్ రీజనల్ ఆఫీసు డైరెక్టర్‌గా నియమించింది. 1980 మే 12న ఆ ఉద్యోగంలో చేరిన ఆయన...2010న అక్కడే రిటైరయ్యారు. అలా ఉద్యోగం చేస్తూనే ఎన్నో సాహిత్య, సంగీత, సాంస్కృతిక సంస్థలకు ఎనలేని సేవలందించారు. ప్రసిద్ధిగాంచిన 'రాజాలక్ష్మి ఫౌండేషన్' వ్యవస్థాపకుడు రమణయ్య రాజా గారితో ఏర్పడిన సాన్నిహిత్యం వల్ల ఆ సంస్థ కార్యక్రమాల నిర్వహణను వేణుగోపాలరావే పర్యవేక్షించేవారు. 2008 నుంచి మ్యూజిక్ అకాడమీ కార్యదర్శిగా తొమ్మిదేళ్లపాటు పని చేశారు. చెన్నపురి ఆంధ్రమహాసభకు కార్యదర్శిగా వ్యవహరించారు. సంగీత నాటక అకాడమీ సెంట్రల్ సభ్యుడిగా వ్యవహరించారు. అదే విధంగా కళాక్షేత్రలోనూ సభ్యుడిగా సేవలందించారు. ఆయనకు కేంద్ర నాటక అకాడమీ అవార్డు కూడా ప్రదానం చేసింది. పప్పు వేణుగోపాలరావు మృతికి టీటీడీ చెన్నై సమాచారకేంద్ర సలహామండలి సభ్యుడు పీవీఆర్ కృష్ణారావు తీవ్ర సంతాపం ప్రకటించారు. తమ సంస్థ రాజాలక్ష్మి ఫౌండేషన్‌తో ఆయనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా కృష్ణారావు స్మరించుకున్నారు.

● సివిల్ జడ్జీల ఎంపిక

టీఎన్‌పీఎస్సీకి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ తోసివేత

అడయార్, ఏప్రిల్ 8: సివిల్ జడ్జిల ఎంపిక అంశంలో తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎన్‌పీఎస్సీ)కి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. 2018 తర్వాత రాష్ట్రంలోని న్యాయస్థానాల్లో సివిల్ జడ్జిల నియామకం జరగలేదు. ఈ నేపథ్యంలో గత యేడాది ఈ పోస్టుల భర్తీపై టీఎన్‌పీఎస్సీ దృష్టిసారించి, దాదాపు 250 మంది వరకు న్యాయమూర్తులను నియమించింది. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకుని, రాతపరీక్షకు హాజరుకాని అభ్యర్థులు టీఎన్‌పీఎస్సీపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు దాన్ని తోసిపుచ్చింది. హైకోర్టు తీర్పుపై అముద అనే అభ్యర్థి సహా మొత్తం 37 మంది అపెక్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి సంజయ్ కరోల్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన ధర్మాసనం... టీఎన్‌పీఎస్సీ నిబంధనలకు లోబడే అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని, సివిల్ జడ్జీల నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యాయని, ఇలాంటి పరిస్థితుల్లో పిటిషన్లను ఏ విధంగా అర్హులుగా ప్రకటిస్తారని పేర్కొంటూ ఆ పిటిషన్‌ను కొట్టి పారేసింది.

రంజాన్ వేళలు

మంగళవారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.28

బుధవారం : సహర్ : ఉదయం -4.18



కుటుంబసభ్యుల కోసం శ్రమిస్తున్న డీఎంకే

● దేశం కోసం పాటుపడుతున్న మోదీ ప్రభుత్వం ● కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



రోడ్‌షోలో ప్రసంగిస్తున్న రాజ్‌నాథ్ సింగ్

పెరంబూర్, ఏప్రిల్ 8: డీఎంకే, కాంగ్రెస్‌లు వారి కుటుంబాల కోసం శ్రమిస్తున్నాయని, కానీ ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే దేశం కోసం పాటుపడుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. నామక్కల్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కేపీ రామలింగానికి మద్దతుగా రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కానరాని అభివృద్ధి ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 10 ఏళ్లలో సాధించిందన్నారు. 2014కు ముందు ఆర్థిక వ్యవస్థలో ప్రపంచంలో భారత్ 11వ స్థానంలో ఉండేదని, ప్రస్తుతం 5వ స్థానంలో ఉండగా, 2027 నాటికి 3 స్థానానికి చేరుకుంటామన్నారు. గత ఎన్నికల్లో 303 సీట్లు సాధించి బీజేపీ సొంత బలంతో అధికారం చేపట్టిందని, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. ప్రస్తుతం డీఎంకే, కాంగ్రెస్‌లు 'ఇండియా' కూటమి ఏర్పాటు చేశాయని, వారి లక్ష్యాలు వేరు, ఎన్డీఏ కూటమివి వేరన్నారు. రాజరాజ్యం, రాముడి పాలనలో ఉన్నామని తెలిపారు. అలాగే, కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దుచేశామని, పౌరసత్వ సవరణ చట్టంతో ఏ మతానికి ఇబ్బందులు ఉండవని, ఏ మతం వారు కూడా దేశాన్ని విడిచి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టం ముస్లిం సోదరీమణులకు, తల్లులకు ప్రయోజనం చేకూర్చిందన్నారు. ఇప్పటివరకు క్షిపణులు, బుల్లెట్లు సహా అన్ని సైనిక పరికరాలను దిగుమతి చేసుకొనే వారమని, ప్రధాని మోదీ చేపట్టిన చర్యలతో రక్షణ రంగానికి అవసరమైన అన్నిరకాల పరికరాలు స్వయంగా సిద్ధం చేసుకుంటున్నామన్నారు. రైతులకు మూడు విడతలుగా తలా రూ.2 వేలు అందిస్తున్నామన్నారు. ప్రధాని మోదీకి చేయూతనందించాలని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

కనులపండువగా అఖిలాండేశ్వరి రథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపం తిరువానైక్కావల్ జంబుకేశ్వర అఖిలాండేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం పంగుని మహా రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ ఆలయంలో యేటా మాసి - పంగుని మాసాల్లో మండల బ్రహ్మోత్సవాలు 48 రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో మండల బ్రహోత్సవాలు గత నెల 17న మహా ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 24 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పంగుని రథోత్సవం కోసం అష్ట దిక్కులా ధ్వజారోహణం ఈ నెల 3న నిర్వహించారు. ఆ రోజు నుంచి రోజూ స్వామిఅమ్మవార్లు ఉదయం, సాయంత్రం వివిధ వాహనాల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంగుని మహా రథోత్సవ ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఆదివారం రాత్రి స్వామిఅమ్మవారు మాడవీధుల్లో విహరించారు. ఈ నేపథ్యంలో సోమవారం రథోత్సవం సందర్భంగా ఆలయాన్ని వేకుజామునే తెరచి స్వామిఅమ్మవార్లకు ఉత్సవ మండపంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత వేకువజాము 5.30 గంటలకు ఉత్సవర్లు జంబుకేశ్వరస్వామి మహారథంలో, అఖిలాండేశ్వరి మరో రథంలో సర్వాలంకరణ శోభితులై కొలువుదీరారు. ముందుగా వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి చిన్న రథాల్లో బయలుదేరారు. ఆ రథాల వెనుకే స్వామిఅమ్మవారి రథాలు కూడా బయలుదేరాయి. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్ని రథాల మోకుతాళ్లను పట్టుకుని లాగారు. ఉదయం 12.30 గంటలకు వరకు రథాలు మాడవీధులలో ఊరేగిన తర్వాత రథ మండపాల ప్రాంతానికి చేరాయి. ఈ రథోత్సవంలో ఆలయ ఏనుగు అఖిలా పెద్ద రథాలకు ముందు గాంభీర్యంగా నడిచివెళ్లింది. మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ వేడుకలు భక్తులను ఛైమరపించాయి. రథోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం, మజ్జిగ, పానకాల పంపిణీ కూడా జరిగాయి.



రథోత్సవంలో భక్తులు - (ఇన్‌సెట్‌లో) అఖిలాండేశ్వరి

సమాచార దర్శిని

వ్యాస రచనలకు ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: నగరంలో వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచ తమిళ పరిశోధన మహానాడు కోసం పరిశోధకుల నుంచి వ్యాసాలను ఆహ్వానిస్తున్నారు. ప్రపంచ తమిళ పరిశోధన సంఘ భారత శాఖ, ఎస్ఆర్ఎం, తమిళ్ పేరాయం సంయుక్తంగా 2025 ఏప్రిల్‌లో 12వ ప్రపంచ తమిళ పరిశోధన మహానాడును కాటాన్‌కొళత్తూర్‌లో ఉన్న ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నాయి. సాహిత్య, సంస్కృతి, భాష, జానపద, నాటక, శిలాశాసనాలు, తాళపత్రాలు, అనువాదం, వైద్య, సాంఘిక వంటి వివిధ శాఖల్లో తమిళ ప్రభావం ఎక్కువగా ఉన్న పరిశోధన వ్యాసాలను జూలైలోగా పంపించాలని, ఇతర వివరాలకు నెం.044-27417375 లో సంప్రదించవచ్చని మహానాడు సమన్వయకర్త ప్రొఫెసర్ జగద్రక్షకన్ తెలిపారు.

'నీట్' శిక్షణకు మొబైల్ యాప్

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: శిక్షణ కేంద్రాలకు వెళ్లకుండా విద్యార్థులు నీట్‌కు సన్నద్ధం అయ్యేలా కేంద్రప్రభుత్వం కొత్త యాప్ పరిచయం చేసింది. వైద్య కోర్సుల్లో చేరేందుకు నీట్... ఐఐటీ, ఇంజనీరింగ్ వంటి విద్యా సంస్థల్లో చేరేందుకు జేఈఈలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ పరీక్షలో ఎక్కువ మార్కులు పొందేందుకు విద్యార్థులు ప్రైవేటు శిక్షణ కేంద్రాల్లో చేరుతుంటారు. ఈక్రమంలో అందరికీ అందుబాటులో ఉండేలా 'నేషనల్ టెస్ట్ అభ్యాస్' అనే మొబైల్ యాప్‌ను కేంద్రప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌లో జేఈఈకి సంబంధించి 193 మోడల్ పరీక్షలు, నీట్‌కు సంబంధించి 204 మోడల్ పరీక్షలు అప్‌లోడ్ చేశారు. అలాగే, జేఈఈ పరీక్షకు 63 రకాల పరీక్షలు, నీట్‌కు 59 రకాల పరీక్షలు ఉంటాయి.

మే 15 వరకు ప్రజాభిప్రాయ సేకరణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: మదురై, కోయంబత్తూర్ సహా 8 నగరాల సంపూర్ణ పథకం ముసాయిదా పత్రంపై ప్రజాభిప్రాయ సేకరణ మే 15వ తేది వరకు జరగనుంది. రాష్ట్రంలో చెన్నైకి ఆవల ఉన్న ప్రాంతాల నగరాభివృద్ధి పథక పనులు డీటీసీపీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. వీటిలో 90 శాతం పనులకు సంపూర్ణ పథకాలు లేవని ఆరోపణలొస్తున్నాయి. దీంతో కోయంబత్తూర్, మదురై, ఈరోడ్, తిరుప్పూర్, తిరుచ్చి, సేలం, తిరునల్వేలి, వేలూరు నగరాలకు పూర్తి పథకాలను రూపొందించారు. ఈ పథకాలపై మే 15వ తేది వరకు ప్రజల అభిప్రాయాలు సేకరించి పనులు చేపట్టనున్నట్లు డీటీసీపీ డైరెక్టర్ గణేశన్ తెలిపారు.

13న కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: యువకులకు ఎన్నికలపై అవగాహన కల్పించేలా ఈనెల 13వ తేది కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ లక్ష్యంగా పెట్టుకున్న ఈసీ, వివిధ అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. స్థానిక రిప్పన్ భవనంలో ఉన్న అమ్మా మాలిగైలో 13వ తేది ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు జరుగుతాయి. ఆసక్తి ఉన్న వారు పేరు, వివరాలను goalquiz@gmail.comలో నమోదు చేసుకోవాలి. మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు అందజేయనున్నారు. వివరాలకు నెం.9840927442లో సంప్రదించవచ్చు.

ఐదుగురు సివిల్ జడ్జీలకు పదోన్నతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: ఐదుగురు సివిల్ న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జీలుగా పదోన్నతి పొందారు. చెన్నై జార్జిటౌన్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జి.శివకుమార్ బన్రూటికి, తిరుప్పూర్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కె.ప్రభు ఉళుందూర్‌పేటకు, మదురై వాడిపట్టి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎస్.వెంకటలక్ష్మి చెన్నైలో ఉన్న రాష్ట్ర న్యాయసేవల కమిషన్ డిప్యూటీ కార్యదర్శిగా, కోయంబత్తూర్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎస్.ధనలక్ష్మి సేలం రెండో అదనపు జడ్జిగా, ధర్మపురి జిల్లా జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎ.ప్రభు తంజావూరు జిల్లా పట్టుకోట జడ్జిగా బదిలీ చేస్తూ మద్రాసు హైకోర్టు ప్రధాన రిజిస్ట్రార్ జ్యోతిరామన్ ఉత్తర్వులు జారీ చేశారు.

కారుణ్య ఉద్యోగానికి కొత్త ప్రకటన

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: సస్పెన్షన్‌కు గురైన పోలీసులు మృతి చెందితే వారసులు కారుణ్య పద్ధతిలో ఉద్యోగాలకు అర్హులేనని పోలీసు శాఖ ప్రకటించింది. విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసుల పిల్లలకు కారుణ్య పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో, సస్పెన్షన్‌కు గురైన పోలీసులు మరణించినా కూడా ఈ విధానం వర్తిస్తుందని, ఉద్యోగ విరమణ పొందేందుకు ఐదేళ్లుండగా, అస్వస్థతకు గురైన పోలీసుల పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.

14న ఆదిపురీశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: స్థానిక చింతాద్రిపేటలో ఉన్న త్రిపురసుందరి సమేత ఆదిపురీశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. 16వ తేది అధికార నంది సేవ, 17న వృషభ వాహనంపై స్వామివారి దర్శనం, 20న రథోత్సవం జరుగనుంది. 28వ తేది వరకు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజు వివిధ అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

15నుంచి చేపల వేటపై నిషేధం

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: చేపల వేటపై నిషేధకాలం ఈనెల 15న ప్రారంభం కానుంది. ఏటా మత్స్య సంపద పెంపొందించేలా చేపలు పట్టడంపై ప్రభుత్వం 61 రోజులు నిషేధం విధిస్తున్న విషయం తెలిసిందే. ఆ ప్రకారం, ఈ ఏడాదికి నిషేధ కాలం 15వ తేది ప్రారంభం కానుంది. వారం రోజులు మాత్రమే ఉండడంతో నడి సముద్రంలోకి వెళ్లిన మోటరు పడవల జాలర్లు తీరానికి వెనుదిరగడం ప్రారంభించారు. ఈ నిషేధకాలంలో చేపల ధరలు పెరిగే అవకాశముంది.

తాగునీటి జలాశయాల్లో 65.17 శాతం నిల్వలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: నగరానికి తాగునీరు అందించే జలాశయాల్లో నీటినిల్వలు 65.17 శాతం ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. పుళల్, పూండి, చోళవరం, చెంబరంబాక్కం, కన్నన్‌కోట తేర్వాయ్‌కండిగ జలాశయాలు నగర ప్రజల తాగునీటి ఆధారంగా ఉన్నాయి. 3,300 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన పుళల్ జలాశయంలో ప్రస్తుతం నీటి నిల్వలు 2,808 మిలియన్ ఘనపుటడుగులుగా ఉంది. నీటి చేరిక 215 ఘనపుటడుగులు కాగా నీటి విడుదల 180 ఘనపుటడుగులుగా ఉంది. ఇదే విధంగా 1,081 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన చోళవరం జలాశయంలో నీటి నిల్వలు 218 మిలియన్ ఘనపుటడుగులుగా ఉన్నాయి. 500 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం కలిగిన తేర్వాయ్ కండిగ జలాశయంలో నీటినిల్వలు 424 మిలియన్ ఘనపుటడుగులుగా ఉంది. ఈ ఐదు జలాశయాల్లో 65.17 శాతం నీటినిల్వలున్నాయని, ముఖ్యంగా చెంబరంబాక్కంలో 74.07 శాతం, పుళల్‌లో 85.09 శాతం, పూండిలో 46.8 శాతం, చోళవరంలో 20.17 శాతం, తేర్వాయ్ కండిగలో 84.8 శాతం నిల్వలున్నాయి.

'చెన్నై తెలుగు అసోసియేషన్' ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు



ముఖ్య అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'చెన్నై తెలుగు అసోసియేషన్' ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. మధురవాయల్‌లోని సీతాలక్ష్మి తిరుమణ మండపంలో జరిగిన ఈ వేడుకలకు రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సీపీ రావు ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా ప్రముఖ ఆర్కిటెక్ట్ ఎం.ఆదిశేషయ్య, పూరా గ్రూపు చైర్మన్ పూరా లక్ష్మీ నరసింహారావు, ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. సంస్థ అధ్యక్షుడు కేఆర్‌కే బాలాజీ రావు, కార్యదర్శి వైఎస్‌వీ సుబ్బారావు, కోశాధికారి మల్లికార్జున తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తూ జన్మదిన వేడుకలు

- ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 8: నగరంలో గంజాయి తాగుతూ జన్మదిన వేడుకలు జరుపుకున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేకే నగర్ సమీపం రాణి అన్నానగర్ హౌసింగ్ బోర్డు గృహ సముదాయంలో గంజాయితో వేడుకలను నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ బాలసుబ్రమణియన్ నేతృత్వంలో పోలీసులు 14వ బ్లాక్ 4వ అంతస్తులో విద్యార్థులు గంజాయి సేవిస్తూ ఆటపాటల్లో మునిగిఉండడాన్ని చూసి పోలీసులు దిగ్భ్రాంతి చెందారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ముగ్గురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు 130 మద్యం బాటిళ్లు, గంజాయి ప్యాకెట్లు, రెండు పట్టా కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

పేదలకు రంజాన్ సరుకుల పంపిణీ



కిరాణా సరుకులు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 8: రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు కిరాణా సరుకులు అందించే కార్యక్రమం సోమవారం పేర్నాంబట్టులో జరిగింది. సమాజసేవకులు ఎండీ రాకీబ్, ఎస్డీ దప్‌కోస్ మహ్మద్ ప్రతి ఏడాది రంజాన్ రోజున పేదలకు బియ్యం, పప్పులు, నూనె, సేమియా, మసాలా వస్తువులు అందజేస్తుంటారు. ఈ ఏడాది రంజాన్ సందర్భంగా 330 మందికి కిరాణా సరుకులు అందజేశారు.

కేవీ కుప్పంలో రూ.8 లక్షల స్వాధీనం

వేలూరు, ఏప్రిల్ 8: కేవీ కుప్పం సమీపం కాంకుప్పం గ్రామానికి చెం దిన నటరాజన్ ఇంట్లో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ లు చేపట్టి రూ.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నిక ల్లో ప్రజలను మభ్యపెట్టేలా రాజకీయపార్టీలు నగదు, బహుమతులు అందించడాన్ని అడ్డుకొనేలా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో, తమకు అందిన ఫిర్యాదు మేరకు నటరాజన్ ఇంట్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు లెక్కల్లో చూపని రూ.8 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికల సందర్భంగా 10,214 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకోనున్న ప్రజల సౌకర్యార్థం 10,215 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర రవాణా సంస్థ తెలియజేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో నగరం నుంచి నడుపుతున్న 2,092 బస్సులతో పాటు అదనంగా 2,970 సర్వీసులు నడుపుతామని తెలిపారు. అలాగే, మిగిలిన నగరాల నుంచి 3,060 ప్రత్యే బస్సులు నడపనున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత 20, 21 తేదీల్లో సాధారణంగా నడిచే 3,060 బస్సులతో పాటు అదనంగా 1,825 ప్రత్యేక బస్సులు నడుపునున్నారు. 24 గంటల కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు, నెం.9445014450, 9445014436లలో సంప్రదించవచ్చు. టీఎన్ఎస్టీసీ వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. అలాగే కోయంబేడు, కిలంబాక్కం బస్ టెర్మినళ్లకు నగరంలో పలు ప్రాం తాల నుంచి అదనంగా ఎంటీసీ బస్సులు నడుపున్నట్లు రవాణా శాఖ తెలియజేసింది.

10న వేలూరుకు ప్రధాని రాక

వేలూరు, ఏప్రిల్ 8: వేలూరు లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగంకు మద్దతుగా బుధవారం ప్రధాని మోదీ వేలూరులో ప్రచారం చేయనున్నారు. కోట మైదానంలో జరిగే బహిరంగ సభలో మోదీ పాల్గొననున్నారు. అందుకోసం ప్రధాని చెన్నై నుంచి బుధవారం ఉదయం హెలికాప్టర్‌లో అబ్దుల్లాపురంలోని హెలిప్యాడ్ చేరుకుంటారు. అక్కడి నుంచి పాత బైపాస్ రోడ్డు మీదుగా కోట మైదానానికి చేరుకుంటారు. సభ అనంతరం ప్రధాని చెన్నై వెళ్లనున్నారు. ప్రధాని రాక సందర్భంగా 4,500 మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టనున్నారు. కాగా, 11 ఏళ్ల క్రితం గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ శ్రీపురం స్వర్ణాలయానికి వచ్చారు.

నేడు కూత్తాండవర్ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు ప్రారంభం



కూత్తాండవర్, హిజ్రాలు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట సమీపం కూవాంగంలోని సుప్రసిద్ధ కూత్తాండవర్ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు మంగళవారం ఉదయం ప్రారంభమవుతున్నాయి 10న మహాభారత పఠనం, స్వామివారి ఊరేగింపు జరుగుతాయి. 12న భీష్మజననం, 14న పాంచాలి జననం, 17న కూత్తాండవర్ ఆవిర్భావం, స్వామివారి ఊరేగింపు జరుగుతాయి. 21న కూత్తాండవర్‌కు బాలాయలం జరుపుతారు. 22 సాయంత్రం స్తంభాలు నిలిపే కార్యక్రమం, 23న అత్యంత కీలకఘట్టమైన హిజ్రాల మాంగల్యధారణ కార్యక్రమం జరుగుతాయి. ఆ సందర్భంగా ఆలయ పూజారి హిజ్రాల మెడలో మంగళసూత్రాన్ని కడతారు. ఆ తర్వాత 24న చిత్తిరై రథోత్సవం, 25న విడయాత్రి ఉత్సవం, 26న ధర్మరాజు పట్టాభిషేక ఉత్సవం జరుగుతాయి. 18 రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి వేలసంఖ్యలో హిజ్రాలు విచ్చేస్తారు.

చెన్నైలో తపాలా ఓట్ల పోలింగ్ ప్రారంభం



నగరంలో తపాలా ఓటు వేస్తున్న 85 యేళ్లు పైబడిన వృద్ధులు

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో 85 యేళ్లు దాటిన వృద్ధులు దివ్యాంగుల కోసం తపాలా ఓట్ల పోలింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. పోలీసుల భద్రత నడుమ పోలింగ్‌ను వీడియో తీశారు. సౌత్‌చెన్నై, సెంట్రల్ చెన్నై, నార్త్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గాలలో 85 యేళ్లకు పైబడిన వృద్ధులు 4175 మంది, 375 మంది దివ్యాంగులు తమ ఇళ్ల వద్దే ఓటు హక్కును వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ ప్రకారం తపాలా ఓట్ల పోలింగ్‌ను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకఅధికారులను నియమించింది. సోమవారం ఉదయం తపాలా ఓట్ల నమోదు ప్రారంభమైంది. తిరువొత్తియూరులో 56 మంది, ఆర్కేనగర్‌లో 104 మంది, పెరంబూరులో 212 మంది, కొళత్తూరులో 274 మంది, తిరువికనగర్‌లో 67 మంది, రాయపురంలో 52 మంది, విరుగంబాక్కంలో 396 మంది, సైదాపేటలో 241 మంది, టి.నగర్‌లో 560 మంది, మైలాపూరులో 364 మంది, షోళింగనల్లూరులో 302 మంది, విల్లివాక్కంలో 261మంది, ఎగ్మూరులో 157 మంది, హార్బర్‌లో 55మంది, చేపాక్‌లో 129 మంది, థౌజెండ్‌లైట్స్‌లో 370 మంది, అన్నానగర్‌లో 536మంది ఈ తపాలా ఓట్లు వేశారు. ఈ నెల 13 వరకు ఈ తపాలా ఓట్ల పోలింగ్ జరగనుంది.



తపాలా ఓట్లు సేకరిస్తున్న ఎన్నికల అధికారి సుబ్బులక్ష్మి

వేలూరు: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో 85 యేళ్లు దాటిన వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకొనే పనులను స్థానిక తొరప్పాడి పెరియార్ నగర్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి కవిత, తహసీల్దార్ గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 8: సికింద్రాబాద్ - రామనాథపురం - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.07695 సికింద్రాబాద్ - రామనాథపురం స్పెషల్ ఈ నెల 10, 17, 24 (గురువారం) తేదీల్లో సికింద్రాబాద్‌లో రాత్రి 9.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.45 గంటలకు రామనాథపురం చేరుకుంటుంది. నెం.07696 రామనాథపురం - సికింద్రాబాద్ స్పెషల్ ఈ నెల 12, 19, 26 (శుక్రవారం) తేదీల్లో రామనాథపురంలో ఉదయం 9.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

న్యూ గుంటూరు వెళ్లని జనశతాబ్ది, అండమాన్, లక్నో రైళ్లు...

ఆంధ్ర రాష్ట్రం గుంటూరు - నిడుబ్రోలు మధ్య చేపట్టనున్న మరమ్మతుల కారణంగా నెం.12077 చెన్నై సెంట్రల్‌లో ఉదయం 7.25 గంటలకు విజయవాడ బయల్దేరే జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 30వ తేది వరకు న్యూ గుంటూరు మార్గానికి బదులుగా తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా వెళ్లనుంది. అలాగే, నెం.16031 చెన్నై సెంట్రల్- శ్రీ వైష్ణో దేవి కత్రా (అండమాన్ ఎక్స్‌ప్రెస్) రైలు ఈ నెల 10 నుంచి 28వ తేది, నెం.16093 చెన్నై సెంట్రల్ - లక్నో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి 30వ తేది వరకు న్యూ గుంటూరు మార్గానికి బదులుగా తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా వెళ్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

11న ఆదివారం టైంటేబుల్‌తో సబర్బన్ రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 8: సబర్బన్ రైళ్లు గురువారం రోజున ఆదివారం టైంటేబుల్ ప్రకారం నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. రంజాన్ సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో ఈనెల 11న మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ - తిరువళ్లూర్ - తిరుత్తణి, చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు, కాంచీపురం, చింతాద్రిపేట - వేళచ్చేరి మధ్య సబర్బన్ రైళ్లు ఆదివారం టైంటేబుల్‌తో నడువనున్నాయి. అలాగే, గురువారం రిజర్వేషన్ కౌంటర్లు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే పని చేస్తాయని దక్షిణ రైల్వే తెలియజేసింది.

ఇంజనీరింగ్ కోర్సుల ఫీజులు పెంపు

పెరంబూర్, ఏప్రిల్ 8: ఇంజనీరింగ్ కోర్సుల ఫీజులు 25 శాతం పెంచాలని కోరుతూ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల యజమాన్యాలు ఫీజు నిర్ణయ కమిటీకి వినతిపత్రం సమర్పించాయి. దీంతో, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కోర్సుల ఫీజులు పెరిగే అవకాశముంది. పెంచుతున్న ఫీజులు మూడేళ్ల వరకు అమలులో ఉంటాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రభుత్వ వాటా సీట్లకు రూ.50,000, మేనేజ్‌మెంట్ కోటా రూ.85,000 ఫీజుగా ఉంది.

జైలు నుంచే సెంథిల్ బాలాజి డైరెక్షన్ : అన్నామలై

పెరంబూర్, ఏప్రిల్ 8: జైలు నుంచే ప్రతిరోజు సెల్‌ఫోన్‌లో ఎన్నికల ప్రచారం, వ్యూహాల గురించి మంత్రులను సెంథిల్ బాలాజి దిశానిర్దేశం చేస్తున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. కోయంబత్తూర్‌లో సోమవారం అన్నామలై మీడియాతో మాట్లాడుతూ... ప్రచారం కోసం జైలు నుంచే కథ, మాటలు, స్క్రీన్‌ప్లే రాసి అందిస్తున్నది సెంథిల్ బాలాజి అన్నారు. ఈసారి డీఎంకే ఎన్ని అడ్డదారులు తొక్కినా కోవైలో బీజేపీ విజయం సాధిస్తుందని తెలిపారు. పోలయ్యే ఓట్లలో 60 శాతం బీజేపీకి దక్కుతాయన్నారు. తాంబరం రైలులో పట్టుబడిన రూ.4 కోట్ల నగదుకు తనకు ఎలాంటి సంబంధం లేదని నయినార్ నాగేంద్రన్ చెబుతున్నా, ప్రతిపక్షాలు ఈ వ్యవహారాన్ని రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంలో తగిన విచారణ చేపట్టాలని తాము కూడా కోరామన్నారు. రాష్ట్రంలో కనీసం 4 అంతర్జాతీస్థాయి క్రీడా మైదానాలు అవసరమన్నారు. క్రీడా మైదానాలు కావాలంటే తొలుత రోడ్లు బాగు చేయాలని అన్నామలై సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అన్నామలై

2024 నాటికి ఎంఎస్ఎంఈలు శక్తివంతం



అడయార్, ఏప్రిల్ 8: వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి ఎంఎస్ఎంఈ(మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్)లు మరింత శక్తివంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సదరన్ రీజియన్ వెల్లడించింది. ఇందుకోసం 4.0 పేరుతో రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించింది. సదరన్ రీజియన్ ఆవిష్కరణలు, ఆర్థిక రంగాల్లో కీలకాంశాల్లో వృద్ధి, ప్రాంతీయ స్థితి స్థాపకత, దేశ ఆర్థిక రంగానికి ఊతమిచ్చేలా మూలస్తంభంగా ఉందని సీఐఐ సదరన్ రీజియన్ మేనేజింగ్ డైరెక్టర్, చంద్రా టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆర.నందిని వెల్లడించారు. సోమవారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమెతో పాటు సీఐఐ సదరన్ రీజియన్ డిప్యూటీ చైర్మన్‌గా థామస్ జాన్ ముత్తూట్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దక్షిణ రీజియన్‌లోని ఎంఎస్ఎంఈలను శక్తివంతం చేసేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

విక్రవాండి నియోజకవర్గం ఖాళీ అంటూ ప్రకటన

పెరంబూర్, ఏప్రిల్ 8: విక్రవాండి నియోజకవర్గం ఖాళీ అయినట్లు అసెంబ్లీ కార్యదర్శి సోమవారం ప్రకటించారు. విక్రవాండి డీఎంకే ఎమ్మెల్యే పుహళేం (71) రెండు రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో, విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయినట్లు అధికారికంగా అసెంబ్లీ కార్యదర్శి ఎన్నికల కమిషన్‌ను లేఖ రాశారు. ఈనెల 19వ తేది లోక్‌సభ ఎన్నికలు, విలవంగోడు అసెంబ్లీ ఉపఎన్నిక జరుగనుంది. కాగా, తగిన సమయం లేకపోవడంతో ఆ ఎన్నికలతో పాటు విక్రవాండి నియోజకవర్గ ఉపఎన్నిక జరిగే అవకాశం లేదని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి.

22కు ఓపీఎస్ కేసు వాయిదా

పెరంబూర్, ఏప్రిల్ 8: ఆదాయానికి మించి ఆస్తుల కేసు నుంచి ఓ.పన్నీర్‌సెల్వంను విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన కేసు విచారణ ఈనెల 22వ తేదీకి వాయిదా పడింది. పన్నీర్‌సెల్వంను విడుదల చేయడానికి వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టు సుమోటో కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. తమ వాదనలు వినిపించేందుకు అవకాశం కల్పించాలనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి విజ్ఞప్తితో కేసు విచారణ 22కు వాయిదా వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

- లైంగిక వేధింపుల ఫిర్యాదు

పార్టీ నుంచి దిండుగల్ జిల్లా బీజేపీ నేత తొలగింపు

పెరంబూర్, ఏప్రిల్ 8: దిండుగల్ వెస్ట్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మకుటేశ్వరన్‌ను పార్టీ నుంచి తొలగించారు. పళని సమీపం సామినాథ పురం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలిపై ఆయన లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులందాయి. దీంతో, మకుటేశ్వరన్‌ను పార్టీ నుంచి తొలగించాలని కోరుతూ దిండుగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు కనకరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు లేఖ రాశారు.

తప్పుడు చికిత్సతో రోగి మృతి చెందితే వైద్యుడికి ఐదేళ్ల జైలు

- జూన్ 1 నుంచి కొత్త చట్టం

అడయార్, ఏప్రిల్ 8: వైద్యుడి నిర్లక్ష్యం వల్ల ఒక రోగి మృతి చెందితే ఆ డాక్టరుకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడనుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నట్టు చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు వెల్లడించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ కొత్త చట్టం గురించి వైద్యుల్లో అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమం జరుగుతోంది. అలాగే, ఈ చట్టంలోని విధి విధానాలపై అన్ని రాష్ట్రాల వైద్యశాఖాధికారులకు కేంద్ర ఆరోగ్య శాఖ ప్రధాన సంచాలకుడు అతుల్ గోయల్ సర్క్యులర్ జారీ చేశారు. ఇప్పటివరకు వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఒక రోగి ప్రాణాలు కోల్పోతే దాన్ని నేరంగా పరిగణించి కేసు నమోదు చేసి ఐపీసీ 304ఏ, 1860 ప్రకారం కనిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష విధించనున్నారు. అయితే, కేంద్రం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత వంటి కొత్త చట్టాల ప్రకారంగా ఈ శిక్షను ఐదేళ్లకు పెంచారు.

రిటైర్డ్ రైల్వే అధికారి నివాసంలో సీబీఐ తనిఖీలు

అడయార్, ఏప్రిల్ 8: స్థానిక పెరంబూరుకు చెందిన రిటైర్డ్ రైల్వే ఉన్నతాధికారి నివాసంలో సీబీఐ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పెరంబూరు హైరోడ్డులో ఉన్న ఒక బహుళ అంతస్తు భవనంలో ఇళవరసన్ (65) అనే రైల్వే మాజీ ఉద్యోగితో పాటు ఆయన భార్య చిత్ర, ఇద్దరు కుమారులు నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 8 గంటలకు ఆరుగురు సభ్యులతో కూడిన సీబీఐ అధికారులు... ఇళవరసన్ ఇంటిలో సోదాలు చేపట్టారు. ఈయన పదవీవిరమణ పొంది ఐదేళ్లు అయినప్పటికీ.. సర్వీసులో ఉన్న సమయంలో అక్రమాలు, అవినీతికి పాల్పడినట్టు వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయన నివాసంలో సీబీఐ అధికారులు సోదాలు జరిపారు.

నిబంధనలతో నిరాహార దీక్షకు అనుమతి

అడయార్, ఏప్రిల్ 8: ఓటుకు నోటు ఇవ్వడాన్ని అడ్డుకోవాలని కోరు తూ కోయంబత్తూరుకు చెందిన మరుమలర్చి మక్కల్ ఇయ్యక్కం నిర్వహించ తలపెట్టిన నిరాహార దీక్షకు మద్రాస్ హైకోర్టు ఆంక్షలతో అనుమతి ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులివ్వడాన్ని అడ్డుకోవాలని కోరు తూ ఈ సంస్థ అధ్యక్షుడు ఈశ్వరన్ పలు రకాల అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా ఈ నెల 11వ తేదీ నిర్వహించ తలపెట్టిన నిరాహార దీక్షకు పోలీసులు అనుమతివ్వలేదు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి సత్యనారాయణన్ విచారణ జరిపి 11న నిర్వహించ తలపెట్టిన నిరాహారదీక్షకు షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అన్నాడీఎంకే నేతల వద్ద డబ్బు తీసుకోండి

- ఓటర్లకు మన్సూర్ అలీఖాన్ పిలుపు


అడయార్, ఏప్రిల్ 8: ఓట్ల కోసం వచ్చే అన్నాడీఎంకే నేతల వద్ద ఓటర్లు మాట్లాడుకుని డబ్బులు తీసుకోవాలని సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ పిలుపునిచ్చారు. ఇండియా జననాయగ పులిగల్ పేరుతో పార్టీని స్థాపించిన ఆయన.. వేలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈయన నియోజకవర్గవ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన మద్దతుదారులకు అన్నాడీఎంకే నేతలతో సంప్రదింపులు జరిపి డబ్బులు తీసుకోవాలని ఆయన సూచిస్తున్నారు. దీనికి సంబంధిం చి ఆడియో ఒకటి విడుదలైంది. ఈ ఆడియో గుడియాత్తం, పేర్నాంపట్టు తదితర ప్రాంతాల్లోని వాట్సాప్ గ్రూపుల్లో బాగా షేర్ అవుతోంది. ఈ అంశంపై ఎన్నికల సంఘం అధికారుల ఆదేశం మేరకు జిల్లా నిఘా విభాగం పోలీసులు ఆరా తీస్తున్నారు.

198 ప్రాంతాల్లో కార్చిచ్చు

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: రాష్ట్రంలో పర్యాటక స్థలాలైన ఊటీ, కొడైకెనాల్ సహా 198 ప్రాంతాల్లో ఆదివారం కార్చిచ్చు ఏర్పడినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ యేడాది ఫిబ్రవరి నుంచే అక్కడక్కడా కార్చిచ్చు ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 198 ప్రాంతా ల్లో కార్చిచ్చు ఏర్పడిందన్నారు. ఈక్రమంలో నీలగిరిలో 34, దిండుగల్‌లో 31, కృష్ణగిరిలో 24 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడిందని తెలిపారు.

పెరుగుతున్న తాబేళ్ల మరణాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 8: చెన్నై సముద్రతీరంలో మృతి చెంది తీరానికి కొట్టుకొస్తున్న తాబేళ్ల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా బిసెంట్‌నగర్, తిరువాన్మియూర్, నీలాంగరై, ఉద్దండి, పనయూరు వంటి సముద్రతీరాలకు అప్పుడప్పుడు తాబేళ్ల కళేబరాలు కొట్టుకొస్తున్నాయి. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... కొన్ని తాబేళ్లు వ్యాధులకు గురై, మరికొన్ని పడవలు, నౌకలు ఢీకొని మృతి చెందుతున్నాయని తెలిపారు.



వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగంకు మద్దతుగా సోమవారం వేలూరు కార్పొరేషన్ పరిధిలో ప్రచారం చేస్తున్న పుదియ నీతి పార్టీ నిర్వాహక అధ్యక్షుడు రవికుమార్

19 నియోజకవర్గాల్లో మైనార్టీ ఓట్లే కీలకం!

● పొందేందుకు డీఎంకే - అన్నాడీఎంకే పోటాపోటీ

● చెబుతా వినండి

పెరంబూర్, ఏప్రిల్ 8: రాష్ట్ర జనాభాలో ముస్లింలు 5.81 శాతం, క్రైస్తవులు 6.12 శాతం ఉన్నారు. ఈ రెండు వర్గాలు పారంపర్యంగా అటు డీఎంకే, ఇటు అన్నాడీఎంకే ఓటు బ్యాంకుగా ఉన్నాయి. అలాగే, మొత్తం మైనార్టీ ఓట్లు పొందేలా డీఎంకే-అన్నాడీఎంకే మధ్య పోటీ నెలకొంది. అదే సమయంలో బీజేపీ మాత్రం మైనార్టీ ఓట్లు పొందలేకపోతోంది. గత గణాంకాల ప్రకారం మైనార్టీ ఓట్లు అధికంగా డీఎంకే కూటమి పొందుతోంది. ఈ కూటమిలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, మనిదనేయ మక్కల్ కట్చి తదితర ముస్లిం పార్టీలుండగా, పలు ముస్లిం సంస్థలు 'ఇండియా' కూటమికి మద్దతు ప్రకటించాయి. గత సెప్టెంబరులో బీజేపీ కూటమి నుంచి అన్నాడీఎంకే వైదొలగడంతో కొన్ని మైనార్టీ సంస్థలు ప్రస్తుతం ఆ పార్టీ వైపు చూస్తున్నాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో ఎస్డీపీఐ, ఓవైసీ నేతృత్వంలోని ఎంఐఎం, కొన్ని ముస్లిం పార్టీలు చేరాయి. అదే సమయంలో అన్నాడీఎంకే-బీజేపీలో లోపాయికార ఒప్పందం కుదుర్చుకున్నట్లు డీఎంకే ఆరోపిస్తోంది. అందుకు కారణం అన్నాడీఎంకే అధిష్ఠానం బీజేపీపై తీవ్ర విమర్శలు చేయడం లేదని, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ఆమోదం పొందడంలో తోడుగా నిలిచిందని డీఎంకే పేర్కొంటోంది. బీజేపీ నుంచి వైదొలగడంతో ముస్లింల ఆదరణ తమకు ఉంటుందని అన్నాడీఎంకే గట్టిగా విశ్వసిస్తోంది. ఈ విషయమై ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ... మా ప్రత్యర్థుల నుంచి 50 శాతం ఓట్లు చీల్చే అవకాశముందని ఆయన తెలిపారు. కానీ, ప్రస్తుతం వారు ఓట్ల కోసం ఇలాగే మాట్లాడుతారని, ఎన్నికల అనంతరం బీజేపీ - అన్నాడీఎంకే రెండు ఒకటవుతాయని డీఎంకే నేతలు పేర్కొంటున్నారు.

19 నియోజకవర్గాలు....

రాష్ట్రంలోని 39 నియోజకవర్గాల్లో 19 స్థానాల్లో మైనార్టీ ఓట్లు అభ్యర్థుల విజయానికి కీలకంగా మారనున్నాయి. కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలి, రామనాథపురం, నీలగిరి, చెన్నై, తిరుచ్చి, తంజావూరు, దిండుగల్, వేలూరు, పుదుకోట, కోయంబత్తూర్, శివగంగ, నాగపట్టినం, కాంచీపురం, తిరువారూర్, తిరువళ్లూర్ తదితర జిల్లాల్లో మైనార్టీ ఓట్లు 10 శాతానికి పైగా ఉన్నాయి. డీఎంకే పోటీ చేస్తున్న 21 స్థానాల్లో మైనార్టీ అభ్యర్థులను బరిలో నిలుపలేదు. అదే సయమంలో డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ తిరునల్వేలిలో రాబర్ట్ బ్రూస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నుంచి కె.నవాజ్ ఘనిని రామనాథపురంలో అభ్యర్థులుగా నిలిపింది. అన్నాడీఎంకే పోటీ చేస్తున్న 32 నియోజకవర్గాల్లో కన్నియాకుమారిలో పసలియాన్ నజరేత్, శివగంగలో జేవియర్ దాస్‌ను బరిలో నిలిపింది. ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ప్రత్యర్థిగా అన్నాడీఎంకే పోటీ చేస్తోంది. డీఎంకే కూటమి పార్టీలు ముస్లింలకు అవకాశం కల్పించలేదని ఆ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా, బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి విజయం సాధించాలని వారు భావిస్తున్నారు. అలాగే, ముస్లిం మతగురువులతో కూడిన తమిళనాడు జమా అత్తుల్ ఉలమా సభ బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు ప్రకటించింది. ఇక, తమిళనాడు బిషప్స్ కౌన్సిల్ కూడా బహిరంగంగా ప్రకటించకపోయినా, లౌకికవాద పార్టీలకు ప్రాధాన్యంఇవ్వాలని విజ్ఞప్తి చేశాయి. ఈ పరిణామాలతో మైనార్టీల ఓట్లు అధికంగా డీఎంకే పొందే పరిస్థితులు నెలకొన్నాయి.



నల్లజెండాలతో ధర్నా చేస్తున్న కోడాంగిపట్టి మహిళలు



నయినార్ నాగేంద్రన్‌పై కేసు నమోదు



● తప్పదుగా మరి!

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌పై ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసు నమోదైంది. ఎన్నికల సంఘం ఆదేశం ప్రకారం పార్టీల అభ్యర్థులు రాత్రి 10 గంటల తర్వాత ప్రచారం చేయకూడదు. అయితే నాగేంద్రన్ రాధాపురం శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఆదివారం రాత్రి 10 గంటలు దాటిన తర్వాత ప్రచారం చేశారు. ఈ విషయాన్ని గమనించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి దినేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పళవూరు పోలీసులు నయినార్ నాగేంద్రన్ సహా ఆయన అనుచరులు 25 మందిపై కేసు నమోదు చేశారు.

అన్నాడీఎంకే ఆరిపోయే దీపం!

● పాతమిత్రుడిపై అంత కోసమా?

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకి ఎందుకనో ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేపై ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ పార్టీ ఆరిపోయే దీపమని, కనుకనే ఈ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పెద్ద వెలుగు ప్రసరిస్తున్నట్లు ప్రజలకు అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమల్ ఎన్డీయేపై అవాకులుచెవాకులు పేలుతున్నారని, వీలయినంత త్వరగా ఆయన మెదడును పరీక్షించుకుంటే మంచిదంటూ చురక అంటించారు. కోయంబత్తూరు శరవణపట్టిలో సోమవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తాంబరం వద్ద పట్టుబడిన నగదుకు తనకు సంబంధం లేదని బీజేపీ శాసనసభ్యుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారని, ఆ నగదు స్వాధీనంపై సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కోయంబత్తూరులో అంతర్జాతీయ క్రీడా మైదానం ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రానికి నాలుగు అంతర్జాతీయ స్థాయి క్రీడామైదానాలు అవసరమని అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖకు సమర్థుడైన నాయకుడు లేడని, అన్నామలై రెడీమేడ్ నాయకుడని అన్నాడీఎంకే మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ చేసిన విమర్శపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జూన్ నాలుగు తర్వాత ఆ పార్టీ ఏమవుతుందో ఓపిక పట్టండి, ఆరిపోయే దీపం కదా అందుకే ఇంత వెలుగు అని ఎద్దేవా చేశారు. శ్రీపెరుంబుదూరు డీఎంకే అభ్యర్థి టీఆర్‌బాలుకు మద్దతుగా ప్రచారం చేస్తూ కమల్ బీజేపీ మూడోసారి అధికారం ఇస్తే నాగ్‌పూర్ దేశ రాజధాని అవుతుందని, ఏకమతం కలిగిన దేశంగా మారుతుందని విమర్శించడంపై కూడా అన్నామలై ఆగ్రహం వ్యక్తం చేశారు.



కోడాంగిపట్టిలో ఎన్నికల బహిష్కరణ

● కుక్క కాటుకు చెప్పు దెబ్బ

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్ని సార్లు మొత్తుకున్నా తమ సమస్య గురించి పట్టించుకోకుండా.. ఎన్నికలప్పుడు మాత్రం ఎగరేసుకు వచ్చే నేతలకు తగిన గుణపాఠం చెబుతామంటున్నారు తేని జిల్లా బోడినాయకనూరు సమీపంలోని కోడాంగిపట్టి వాసులు.. ఇంతకీ అసలు విషయం ఏమిటంటారా?.. అయితే చదవండి.. కోడాంగిపట్టిలో నివసిస్తున్న సుమారు వంద కుటుంబాలు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించనున్నట్లు ప్రకటించాయి. 1994లో ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ ద్వారా తమకు కేటాయించిన స్థలాలను ఓ వ్యక్తి నకిలీ దస్తావేజులతో ఆక్రమించుకున్నాడంటూ గ్రామస్తులు నల్లజెండాలు పట్టుకుని సోమవారం ధర్నా నిర్వహించారు. తమ స్థలాలు ఆక్రమణకు గురైన విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

● పాపం ఎంత కష్టమో?

వైన్ షాప్ మూస్తే పురుషుల ఓట్లు ఎలా?

● డీఎంకే ఎమ్మెల్యేకు వింత అనుభవం

పెరంబూర్, ఏప్రిల్ 8: ఆరణి లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి ధరణివేందన్‌కు మద్దతుగా వందవాసి ఎమ్మెల్యే అంబేద్‌కుమార్ తన నియోజకవర్గ పరిధిలో ఆదివారం ప్రచారం చేపట్టారు. పడూర్ గ్రామంలో జరిగి న ప్రచారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... డీఎంకే ప్రభు త్వం మహిళలకు రూ.1,000 అందిస్తోందని మాట్లాడతున్న సమయంలో మహిళలు అడ్డుకొని 'మా ప్రాంతం లో వైన్ షాప్ ఉంది. దానికి తొలగిస్తేనే తాము ఓటు వేస్తాం'అంటూ నినాదాలు చేశారు.వైన్ షాప్ తీయకపోతే మహిళలు ఓట్లు వేయరు. ఒకవేళ తొలగిస్తే పురుషులు ఓట్లు వేస్తారా అంటూ ప్రశ్నించిన ఎమ్మెల్యే అంబేద్‌కుమార్ అనంతరం తను మాటలను సవరించుకొనేలా, బీ జేపీని ఓడించాలంటే డీఎంకేకు ఓట్లు వేయాలని కోరు తూ అక్కడినుంచి మరో ప్రాంతానికి ప్రచారానికి వెళ్లారు.



తిరుచ్చి లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి కరుపయ్య కోసం ప్రచారంలో భాగంగా ఎద్దుల బండి తోలుతున్న మాజీ మంత్రి డాక్టర్ సి.విజయభాస్కర్



చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో 100 శాతం ఓటింగ్ అవగాహన ప్రచారంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది



దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండ్యన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో డీఎంకే మహిళా విభాగం కార్యదర్శి కనిమొళి



చెన్నై కొళత్తూర్‌లో ఉన్న ఎవర్విన్ మహోన్నత పాఠశాల్లో ఓటు హక్కు ప్రాధాన్యం తెలిపేలా ముఖంపై చిత్రంతో విద్యార్థిని

కనీసం నీటి సమస్య కూడా తీర్చలేరా?

● సెంట్రల్‌చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వంతులవారీగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ద్రావిడ పార్టీలు ఇప్పటి వరకూ నీటి సమస్యను కూడా తీర్చలేకపోయాయని సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం విమర్శించారు. ఆయన సోమవారం కోమలీశ్వరన్ కోయిల్ వీధి, చంద్రభాను వీధి, నాగప్పన్ వీధి, సామి చెట్టి వీధి, మునియప్పిళ్లై వీధి, సైఫుల్ మల్క్ స్ట్రీట్, వీరభద్రన్ వీధి, నారాయణ నాయకన్ వీధి, కాంచీపురం పచ్చయప్పన్ వీధి, ఆదితనార్ సాలై, డ్యామ్స్ రోడ్, కరీం మహమ్మద్ షమీ వీధి, బ్లాక్స్ రోడ్, మౌంట్ రోడ్, బూతపెరుమాళ్ కోయిల్ వీధి, జీపీ రోడ్, బూరేగం వీధి, ఎల్‌జీఎన్ రోడ్, మోహదాస్ రోడ్, వీఎన్ దాస్ రోడ్, గోపాల్ దాస్ సాలై, నైనియప్పన్ వీధి, చెల్లపిల్లయార్ కోయిల్ వీధి, అయిల్‌మంగర్ వీధి, జాం బజార్, వీరన్‌పురం వీధి, సామి ఆచారి వీధి, సుబ్బరాయ ముదలివీధి, అమిరున్నిసా బేగం వీధి, జాన్ మహమ్మద్ వీధి, మరుబ్ సాహిబ్ వీధి, జీపీ రోడ్ తదితర ప్రాంతాల్లో ప్రచారంచేపట్టారు.ఈసందర్భంగా ఆయన్ని కలుసుకున్న పలువురు మహిళలు నీటి సమస్య తీర్చాలని కోరారు.వారిసమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చిన వినోజ్..అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఏ వీధిలోచూసినా బిందెలతో మహిళలు మంచినీటి కోసం పరుగులు తీస్తున్నారన్నారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డులో ఇలాంటి పరిస్థితి కనిపించడం దయనీయమన్నారు. తనను గెలిపిస్తే తక్షణమే ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.



వినోజ్ పి.సెల్వం ప్రచారం

● కఠిన నిర్ణయం

'నోటా'కు ఓట్లేద్దాం!

● పుదుకోట నియోజకవర్గ పరిరక్షణ కమిటీ

పెరంబూర్, ఏప్రిల్ 8: పుదుకోట లోక్‌సభ నియోజకవర్గం 2009లో పునర్విభజన జరిగింది. పునర్విభజనతో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తిరుచ్చి పార్లమెంట్ నియోజకవర్గంలో పుదుకోట, గంధర్వకోట అసెంబ్లీ స్థానాలు, కరూర్ పార్లమెంట్ నియోజకవర్గంలో విరాలిమలై, శివగంగ పార్లమెంట్ నియోజకవర్గంలో తిరుమయం, ఆలంగుడి, రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో అరంతాంగిని కలిపారు. దీంతో, జిల్లా ఛిన్నాభిన్నమైందని, మళ్లీ ఇతర నియోకవర్గాల్లో కలిపిన అసెంబ్లీ స్థానాలతో పుదుకోట లోక్‌సభ నియోజకవర్గం ఏర్పాటు చేయాలనే డిమాండ్ నియోజవర్గ పర్యవేక్షణ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ 2009 ఎన్నికల సమయంలో ఇదే విషయాన్ని ముమ్మరంగా ప్రచారం చేపట్టడంతో ఆ ఎన్నికల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ఎవరికి ఓటేసేందుకు ఇష్టం లేదు'(నోటా) అనే నెం.49కు 15,000 ఓట్లు పోలయ్యాయి. నోటాకు ఇన్ని ఓట్లు పోలుకావడం రాజకీయపార్టీలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అనంతరం 2014 ఎన్నికల్లో నోటాకు 51,000 ఓట్లు, 2019 ఎన్నికల్లో 49,000 వేల ఓట్లు నియోజకవర్గ పరిరక్షణ కమిటీ ప్రచారంతో పోలయ్యాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లోనూ తమ డిమాండ్ కొనసాగిస్తూ ఈ కమిటీ జిల్లావ్యాప్తంగా 'నోటా'కు ఓట్లు వేయాలని ప్రచారం చేపట్టింది.

● ఎన్నికల కలిమి

ప్రత్యర్థుల మధ్య వికసించిన చెలిమి

చెన్నై, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించాల్సిన సమయంలో రెండు పార్టీలకు చెందిన ప్రత్యర్థులు ఓ మత వేడుకల్లో పాత చెలిమిని ప్రదర్శించి పార్టీ శ్రేణులకు విస్మయం కలిగించారు. దిండుగల్‌లో ఈస్టర్ ఉత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో డీఎంకేకు చెందిన మంత్రి ఐ.పెరియసామి, అన్నాడీఎంకే మాజీ మంత్రి దిండుగల్ శీనివాసన్, రెండు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ సందర్భంగా దిండుగల్ శీనివాసన్ తన పక్కన ఉన్న కుమారుడు సతీష్‌ను పిలిచి మంత్రి పెరియసామి వద్ద ఆశీస్సులు స్వీకరించమని తెలిపారు. ఆ మేరకు సతీష్ మంత్రి పెరియసామి కాళ్లకు నమస్కరించాడు. వెంటనే పెరియసామి అతడిని పైకి లేపి సుఖ సంతోషాలతో జీవించమంటూ ఆశీర్వదించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న సీపీఎం అభ్యర్థి సచ్చిదానందం, అన్నాడీఎంకే మాజీ మంత్రులు నత్తం ఆర్ విశ్వనాథన్, ఎస్డీపీఐ అభ్యర్థి మహమ్మద్ ముబారక్ తదితరులు ఆ సంఘటనను చూసి చప్పట్లు కొట్టారు. వెంటనే డీఎంకే, అన్నాడీఎంకే కార్యకర్తలు కూడా నవ్వుతూ హర్షం వ్యక్తం చేశారు.



మంత్రి పెరియసామి ఆశీస్సులందుకుంటున్న మాజీ మంత్రి దిండుగల్ శీనివాసన్ కుమారుడు సతీష్

● నమ్మండి ప్లీజ్

నమ్మండి... నేను సినిమా డైరెక్టర్ కాదు!

● నీలగిరి అన్నాడీఎంకే అభ్యర్థి లోకేష్ తమిళ్‌సెల్వన్

పెరంబూర్, ఏప్రిల్ 8: 'మీ అమూల్యమైన ఓట్లు లోకేష్ కనకరాజ్‌కు వేయాలని కార్యకర్తలు పెడుతున్న నినాదాలతో ఖంగుతినడం అభ్యర్థి వంతైంది. నీలగిరి లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థిగా మాజీ స్పీకర్, అవినాశి ఎమ్మెల్యే ధనపాల్ కుమారుడు లోకేష్ తమిళ్ సెల్వన్ పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం హిట్ సినిమాలు అందిస్తున్న డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ పేరు ప్రజల్లో బాగా ప్రాచుర్యం పొందింది. దీంతో, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పలువురు కార్యకర్తలు లోకేష్ కనకరాజ్‌కు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో, ఖంగుతిన్న అన్నాడీఎంకే అభ్యర్థి ఆదివారం సాయంత్రం జరిగిన ప్రచారంలో... తన పేరు లోకేష్ తమిళ్‌సెల్వన్ అని, సినిమా డైరెక్టర్‌ను కానని అటు కార్యకర్తలు, ఇటు ప్రజలకు చెబుతూ ప్రచారం సాగించారు.



లోకేష్ తమిళ్‌సెల్వన్

హీరో ధీరజ్ 'డబుల్ టక్కర్' కథేంటి?

ధీరజ్ - స్మృతి వెంకట్ జంటగా నటించిన చిత్రం 'డబుల్ టక్కర్'. ఇటీవల విడుదలై తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. మీరా మహది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కోవై సరళ, ఎంఎస్ భాస్కర్, మునీష్కాంత్, కాళీ వెంకట్, సునీల్ కె.రెడ్డి తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఈ చిత్ర విజయంపై దర్శకుడు మీరా హర్షం వ్యక్తం చేశారు. తాము పడిన కష్టానికి ప్రతిఫలం దక్కిందన్నారు. ఇందులో ధీరజ్ ద్విపాత్రాభినయం చేశారు. స్మృతి వెంకట్‌తో ప్రేమలో పడిన అరవింద్ (ధీరజ్) ఆత్మహత్యకు ప్రయత్నించి, అదృశ్యమైపోతాడు. కానీ దైవలోకం నుంచి వచ్చిన లెఫ్ట్ అండ్ రైట్ అనే రెండు యానిమేషన్ పాత్రలు అరవింద్ చనిపోయినట్టుగా భావించి అతని ఆత్మను రాజా (ధీరజ్) అనే వ్యక్తి శరీరంలోకి ప్రవేశపెడుతారు. ఆ తర్వాత అరవింద్ మృతదేహం కోసం అతని బంధువులు గాలిస్తారు. అయితే, అరవింద్ మృతదేహం లభించిందా? అరవింద్ - స్మృతి ప్రేమ ఫలించిందా? అన్నదే ఈ చిత్ర కథ అని వివరించారు. ఈ ప్రధాన కథాంశంతో పాటు మన్సూర్ అలీఖాన్ గ్యాంగ్, సునీల్ రెడ్డి - షా రా, కోవై సరళ - పోలీస్, కరుణాకరన్ - యాషికా ఆనంద్, ఎంఎస్ భాస్కర్ బృందం, మునీష్కాంత్ - కాళీ వెంకట్ గ్యాంగ్‌లు ఎవరికి వారు పోటీ పడి ఇందులో నటించారని, వారి నటన చిత్రానికి ఎంతో బలం చేకూర్చిందని తెలిపారు. హీరో ధీరజ్ తన నటనతోనే కాకుండా కామెడీని కూడా పండించి ప్రేక్షకులకు కడుపుబ్బ నవ్వించారని పేర్కొన్నారు. గౌతమ్ రాజేంద్రన్ ఛాయాగ్రహణం, విద్యాసాగర్ నేపథ్య సంగీతం సినిమాకు హైలెట్‌గా నిలిచిందన్నారు.



'డబుల్ టక్కర్'లో ధీరజ్ - స్మృతి వెంకట్

'గుడ్‌లక్' స్టూడియో తొలి వార్షికోత్సవం

కమర్షియల్ చిత్రాలను తెరకెక్కిస్తూ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్న దర్శకుడు హరి తన సతీమణి ప్రీతి విజయకుమారితో కలిసి 'గుడ్‌లక్' స్టూడియోను గత యేడాది ప్రారంభించారు. ఈ స్టూడియో తాజాగా రెండో వార్షికోత్సవాలను జరుపుకుంది. ఈ స్టూడియోలో డబ్బింగ్, మిక్సింగ్, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వంటి చిత్ర నిర్మాణ పనులన్నీ పూర్తి చేసేందుకు అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయి. గత యేడాదిగా అనేక సినిమాల నిర్మాణ పనులు ఈ స్టూడియోలో విజయవంతంగా పూర్తి చేసుకున్నాయి. ఈ స్టూడియోలో తక్కువ ఖర్చుతోనే అన్ని రకాల పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంది. దీనిపై దర్శకుడు హరి మాట్లాడుతూ... చిత్ర పరిశ్రమకు తన వంతు సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ స్టూడియోను గత యేడాది ప్రారంభించామని, తక్కువ ధరకే సినిమా నిర్మాణ పనులు పూర్తి చేసుకునే సౌలభ్యం కల్పించామన్నారు. ఈ సందర్భంగా ఆయన హీరోలు, నిర్మాతలు, టెక్నీషియన్లకు కృతజ్ఞతలు తెలిపారు.



దర్శకుడు హరి దంపతులు

చిత్రజ్యోతి

'విజయ్-69'లో హీరోయిన్ ఎవరు?

అగ్రహీరో విజయ్ నటించనున్న 69వ చిత్రంలో హీరోయిన్ ఎంపిక కోసం అన్వేషణ సాగుతోంది. ఇందుకోసం కోలీవుడ్‌కు చెందిన త్రిష, సమంత, బాలీవుడ్‌కు చెందిన అలియా భట్, మృణాల్ ఠాగూర్‌తో చర్చిస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం వెంకట్‌ప్రభు దర్శకత్వంలో హీరో విజయ్ 'గోట్' చిత్రంలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో విజయ్ నటించే 69వ చిత్రానికి 'తుణివు' ఫేం హెచ్.వినోద్ దర్శకత్వం వహించనున్నారు. ఇందుకోసం ప్రీప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. ఇందులో హీరోయిన్ కోసం అన్వేషణ సాగుతుంది. కాగా, 'విజయ్-69' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారపూర్వక ప్రకటన త్వరలోనే వెల్లడికానుంది.



విడాకుల కోసం కోర్టులో ధనుష్ - ఐశ్వర్య పిటిషన్

అడయార్, ఏప్రిల్ 8: హీరో ధనుష్, సినీ దర్శకురాలు ఐశ్వర్య రజనీకాంత్ మ్యూచువల్ డివోర్స్ (పరస్పర విడాకులు) కోరుతూ మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలోని ఫ్యామిలీ కోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఇద్దరు పిల్లలకు తల్లిదండ్రులైన ఈ దంపతులు విడిపోతున్నట్టు 2022 సంవత్సరం జనవరి నెలలో తమ తమ ట్విటర్ వేదికలుగా అధికారికంగా వెల్లడించారు. ఆ తర్వాత ఈ దంపతులను కలిపేందుకు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ప్రయత్నించారు. దీంతో గత కొంతకాలం అంశం సద్దుమణిగిపోగా, త్వరలోనే వీరిద్దరూ మళ్లీ ఒక్కటి కాబోతున్నారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వారిద్దరూ విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశమైంది. వీరి పిటిషన్లపై త్వరలోనే కోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. కాగా, ధనుష్ - ఐశ్వర్య 2004లో ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెల్సిందే. వీరికి యాత్ర, లింగా అనే ఇద్దరు కుమారులున్నారు. అదే సమయంలో ధనుష్ తన చిత్రాల్లో బిజీగా ఉంటే, ఐశ్వర్య దర్శకత్వంపై దృష్టి సారించారు.

